

అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గు

పార్లమెంట్ ముందు అంబేడ్కర్ చిత్రాలతో నిరసన


TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...



WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 316 గురువారం 19 డిసెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




# ధరణి స్థానంలో భూ భారతి

- ఇక పక్కాగా రెవెన్యూ రికార్డులు
- ప్రజలకు భరోసానిచ్చేలా కొత్త చట్టం
- ధరణి సమస్యలకు చెక్ పెట్టే విధంగా మార్పులు
- వివాదాల పరిశీలనకు కొత్తగా ట్రిబ్యునల్ ఏర్పాటు
- గ్రామానికో రెవెన్యూ అధికారి నియామకం
- అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం తెచ్చిన ప్రభుత్వం
- గత పాలకుల ధరణి మోసాలను ఎండగట్టిన పొంగులేటి

హైదరాబాద్,డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
ధరణిలో జరిగిన అవతవకలను అరికట్టి, రైతులకు న్యాయం చేయాలన్న సంకల్పంతోనే భూభారతిని తీసుకుని వస్తున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. భేషజాలకు పోయి 'ధరణి'ని మార్చడం లేదని.. ప్రజాసమస్యల పరిష్కారానికే ఆ పోర్టల్‌ను రద్దు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేన్లు జరగలేదన్నారు. శాసనసభలో 'భూభారతి' బిల్లును పొంగులేటి ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'ధరణితో అనేక మంది ఇబ్బందులు పడిన మాట వాస్తవం. ఆ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చాం.. ఇప్పుడు వేస్తున్నాం. ధరణి స్థానంలో భూభారతిని తీసుకొస్తున్నాం. భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు లిఖితపూర్వకంగా సూచించిన అంశాలను పొందుపరిచాం. ముసాయిదా బిల్లును 40 రోజులు వెబ్‌సైట్‌లో ఉంచాం. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టాం. రాష్ట్రంలోని 33 కలెక్టరేట్లలో ఒకరోజు చర్చ కూడా నిర్వహించాం.

మిగతాది 2లో...



# ఆదానీ అవినీతికి మోడీ ముసుగు

- అవినీతిపై చర్యకు ప్రధాని వెనకడుగు
- ఆదానీ అవినీతిపై జెపిసి వేయాల్సిందే
- అవసరమైతే రాష్ట్రపతి భవన్ ముందూ ధర్నా
- హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా
- రాజ్‌భవన్ ముందు ధర్నాకు దిగిన ప్రభుత్వ పెద్దలు
- ధర్నాలో సిఎం రేవంత్, డిప్యూటి సిఎం భట్టి, మంత్రులు

2లో.




## తెలుగోడి సాహిత్య సేవకు పట్టం..

### అభ్యుదయ కవి లక్ష్మీ నారాయణ అత్యున్నత పురస్కారం

### కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ ను గెలుచుకున్న కవి



న్యూఢిల్లీడిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
కేంద్ర ప్రభుతం ఉత్తమ సాహిత్యాన్ని అందించే సృజనాత్మక సాహిత్యవేత్తలకు ప్రతి సంవత్సరం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందజేస్తుంది. భారతీయ సాహిత్య పురస్కారాల్లో అత్యున్నతమైన పురస్కారంగా ప్రసిద్ధిగాంచిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ 2024 సంవత్సరానికి గాను పలు భాషలకు చెందిన సాహితీ వేత్తల కథలు, కవితలు, సంపుటాలకు ఈ అత్యుత్తమ పురష్కారం అందుకోనున్నారు. తెలుగు భాషలో ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరుకి చెందిన ప్రముఖ కవి, న్యాయవాది కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డ్ కోసం ఎంపికయ్యారు. లక్ష్మీ నారాయణ వృత్తి రీత్యా న్యాయవాది.మిగతాది 2లో...

## ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

### ఖాకీ చొక్కాలతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

హైదరాబాద్,డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ.. ఖాకీ చొక్కాలు ధరించి తెలంగాణ అసెంబ్లీకి బయల్దేరారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు.మిగతాది 2లో...




## లగచర్ల కేసులో నిందితులకు బెయిల్

### సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిన నాంపల్లి కోర్టు

### ఏ-2 నిందితుడు సురేశ్‌కు బెయిల్ నిరాకరణ



హైదరాబాద్,డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో అరెస్టైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డికి బెయిల్ మంజూరైంది. లగచర్ల కేసులో నరేందర్ రెడ్డి ఏ1 నిందితుడిగా ఉన్నారు. పట్నం నరేందర్ రెడ్డికి నాంపల్లి కోర్టు ఈ రోజు బెయిల్ మంజూరు చేసింది. అతనితో పాటు ఇదే కేసులో నిందితులుగా ఉన్న 24 మందికి కూడా కోర్టు బెయిల్ ఇచ్చింది.పట్నం నరేందర్ రెడ్డి రూ.50 వేల పూచీకత్తును సమర్పించాలని కోర్టు ఆదేశించింది. మిగతా రైతులు రూ.20 వేల వ్యక్తిగత పూచీకత్తును సమర్పించాలని తెలిపింది. ఈ కేసులో ఏ-2 నిందితుడిగా ఉన్న సురేశ్‌కు మాత్రం నాంపల్లి కోర్టు బెయిల్‌ను నిరాకరించింది.

## 31 మంది సభ్యులతో జేపీసీ

- జమిలి ఎన్నికలపై జేపీసీ..
- కమిటీలో ప్రియాంకగాంధీకి చోటు
- 21 మంది లోక్ సభ సభ్యులు,
- 10 మంది రాజ్యసభ సభ్యులు
- కమిటీలో సీఎం రమేశ్, బాలశౌరి,
- హరీశ్ బాలయోగి,



న్యూఢిల్లీ,డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
జమిలి ఎన్నికలపై కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)ని ఏర్పాటు చేసింది. వివిధ పార్టీలకు చెందిన 31 మందితో జేపీసీని ఏర్పాటు చేసింది. ఇందులో 21 మంది లోక్ సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. జేపీసీలో తెలుగు రాష్ట్రాల నుంచి సీఎం రమేశ్, వల్లభనేని బాలశౌరి ఉన్నారు. ఇటీవలే వయనాడ్ లోక్ సభ నుంచి గెలిచిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు.లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు జమిలి కోసం సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లుల పరిశీలన కోసం కేంద్రం జేపీసీని వేసింది.జేపీసీలో లోక్ సభ నుంచి ఉన్న 21 మంది సభ్యుల్లో... పీపీ చౌదరి, సీఎం రమేశ్, బన్సూరి స్వరాజ్, పురుషోత్తంభాయ్ రూపాలా, అనురాగ్ సింగ్ ఠాకూర్, విష్ణుదయాల్ రామ్, భర్తృహరి మహ్తాబ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూని, విష్ణు దత్త శర్మ, ప్రియాంక గాంధీ వాద్రా, మనీష్ తివారి, సుఖ్‌దేవ్ భగత్, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, జీఎం హరీశ్ బాలయోగి, సుప్రియా సూలే, శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, చందన్ చౌహాన్, బాలశౌరి వల్లభనేని ఉన్నారు. రాజ్యసభ నుంచి పది మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు.

## సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన స్పీడ్ బోటు

### పలువురు పర్యాటకుల గల్లంతు

### 21మందిని రక్షించిన కోస్ట్‌గార్డ్ సిబ్బంది



2లో.

## మాల్యా ఆస్తులు అమ్మి బ్యాంకులకు జమ

- లోక్ సభలో కేంద్ర ఆర్థిక మంత్రి
- నిర్మలా సీతారామన్ ప్రకటన
- నీరవ్ మోదీ నుంచి వెయ్యి కోట్లు
- వసూలు చేశామన్న కేంద్ర మంత్రి
- మిగతా ఎగవేతదారుల నుంచి మరో
- 7 వేల కోట్లు రాబట్టామని వెల్లడి



న్యూఢిల్లీ,డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
బ్యాంకు రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన ఆర్థిక నేరస్థుల నుంచి ఈ ఏడాది రూ.22 వేల కోట్లు రాబట్టామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్ సభలో వెల్లడించారు. పరారీలో ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యాకు దేశంలో ఉన్న ఆస్తులను వేలం వేసి రూ.14 వేల కోట్లు బ్యాంకుల్లో జమ చేసినట్లు వివరించారు. అదేవిధంగా గుజరాత్ కు చెందిన వజ్రాల వ్యాపారి, బ్యాంకు రుణాల ఎగవేతదారు నీరవ్ మోదీ ఆస్తులు అమ్మి వెయ్యి కోట్లు వసూలు చేశామన్నారు.మిగతా ఎగవేతదారుల నుంచి ఏడు వేల కోట్లు వసూలు చేసి మొత్తంగా రూ.22,280 కోట్లు వివిధ బ్యాంకులకు జమ చేశామని చెప్పారు. ఇందుకోసం ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), బ్యాంకులు సంయుక్తంగా ముంబైలోని స్పెషల్ కోర్టును ఆశ్రయించాయని తెలిపారు. ఎగవేతదారులకు సంబంధించి ఈడీ అటాచ్ చేసిన ఆస్తులను స్పెషల్ కోర్టు ఆదేశాలతో బ్యాంకులుమిగతాది 2లో...

# ఆదానీ అవినీతికి మోడీ ముసుగు

హైదరాబాద్,డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
భారత వ్యాపార వ్యవస్థలు అవినీతిలో కూరుకు పోయాయని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. వ్యాపారాలు చేయాలంటే లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ 75 ఏళ్లుగా దేశ ప్రతిష్ఠను పెంపొందించిందని చెప్పారు. అదానీ, ప్రధాని కలిసి దేశం పరువు తీశారని ఆరోపించారు. ప్రపంచ దేశాల ముందు భారత్ పరువును తాకట్టుపెట్టారని ఆక్షేపించారు. ఆదానీని ప్రధాని వెనకేసుకుని వచ్చినా, అమెరికా మాత్రం వదలదని హెచ్చరించారు. ఆదానీపై చర్యలకు ఢిల్లీలో కూడా ధర్నాకు వెనకాడబోమని సిఎం రేవంత్ హెచ్చరించారు. మణిపుర్ అల్లర్లు, అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. ఈ సందర్భంగా రాజ్‌భవన్ సమీపంలో సీఎం బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'అదానీ సంస్థలు అమెరికాలో లంచాలు ఇవ్వజూపాయి. చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎఫ్‌బీఐ నివేదించడంతో అక్కడి ప్రభుత్వం చర్యలకు పూనుకుంది. దేశం పరువును మంటగలిపిన అదానీపై విచారణ జరగాలి. దీనిపై విచారణకు జేపీసీ నేతృత్వం వహించాలి. అదానీ అవినీతిపై చర్చ, జేపీసీ వేసేందుకు కేంద్రం సిద్ధంగా లేదు. అలా చేస్తే అదానీ జైలుకి వెళ్లాల్సి వస్తుంది. ఆయన్ను కాపాడేందుకు ప్రధాని మోదీ యత్నిస్తున్నారు. ఈ అంశంపై జేపీసీ వేయకపోతే రాష్ట్రపతి భవన్ వద్ద ధర్నా చేస్తాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. 75 ఏళ్లు కష్టపడి దేశ ప్రతిష్టను కాంగ్రెస్ పెంచితే.. ప్రధాని మోడీ, ఆయన మిత్రుడు అదానీ కలిసి దేశ పరువు తీశారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నెక్లస్ రోడ్ నుండి రాజ్ భవన్ వరకు కాంగ్రెస్ నేతలు పెద్ద ఎత్తున ర్యాలీ తీసి రాజ్ భవన్ రూట్‌లో బైఠాయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. వ్యాపారం చేసేందుకు బిలియనీర్ అదానీ లంచాలు ఇచ్చినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు తేల్చాయి.. ఈ విషయాన్ని పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిలదీశారు.. కానీ ప్రధాని మోడీ దీనిపై మౌనంగా ఉంటున్నారని అన్నారు. అదానీతో ప్రధాని మోడీకి లాలూచీ ఒప్పందం ఉందని.. అందుకే అదానీ కాపాడటానికి ఆయన ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు రాజ్ భవన్ ముట్టడించామని తెలిపారు. మా పోరాటం ఇక్కడితో ఆగదని.. అదానీ అంశంపై జేపీసీ ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రపతి భవన్ ముందు ధర్నా చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వమే ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు.. కానీ దేశ ప్రతిష్టను కాపాడుకోవడానికే రోడ్డుపై నిరసన తెలపాల్సి వచ్చిందన్నారు. పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపైనే నిరసన చేపడుతున్నామని స్పష్టం చేశారు. విధిలేని పరిస్థితుల్లోనే మేం ధర్నా చేపట్టాల్సిన పరిస్థితి వచ్చిందని.. ముఖ్యమంత్రి ధర్నా చేస్తారా అని బీఆర్ఎస్ అంటోంది.. నేను ధర్నా చేయను.. మరీ వాళ్లు వచ్చి చేస్తారా అని ప్రశ్నించారు. అదానీ అంశంపై బీఆర్ఎస్ వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సై అంటే అసెంబ్లీలో ఆదానీ అంశంపై చర్చించి తీర్మానం చేస్తామని అన్నారు. ప్రధాని మోడీ ఆశీస్సులతో ఆయన మిత్రుడు, బిలియనీర్ గౌతమ్ అదానీ దేశ సంపద దోచుకుంటున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకుని అదానీ దేశ ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. అదానీ దేశ ప్రజలను సొమ్మును ఏ విధంగా దోచుకుంటున్నారు.. బ్యాంకులను ఓ విధంగా మోసం చేశారో హిండెన్ బర్గ్, అమెరికా న్యాయవాదులు చెప్పారని గుర్తు చేశారు. అదానీ ఆర్థిక అవకతవకలపై పార్లమెంట్‌లో చర్చ కోసం కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ డిమాండ్ చేస్తోన్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఫైర్ అయ్యారు. కొన్ని నెలలుగా జాతుల మధ్య అల్లర్లతో మణిపూర్ అట్టుడికిపోతున్న మోడీ నోరు విప్పడం లేదని విమర్శించారు. ఈ క్రమంలోనే అదానీ ఇష్యూ, మణిపూర్ అల్లర్ల విషయంలో ప్రధాని మోడీ మౌనాన్ని నిరసిస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఆందోళనలకు దిగామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం






(మొదటి పేజీ తరువాయి)
కాగా, ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లను ఆదుకోవడంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. గత అసెంబ్లీ సమావేశాల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను ఇచ్చామని పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వానికి దున్నపోతు మీద వాన పడ్డట్టే ఉందని అన్నారు. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఇస్తామన్న 12వేల రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని.. బీఆర్ఎస్ పక్షాన వారికోసం పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు, వారికి ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో చర్చించాలని ఇప్పటికే బీఆర్ఎస్ వాయిదా తీర్మానం ఇచ్చింది. ప్రభుత్వ ముందుచూపు లేని విధానాల వల్ల రాష్ట్రంలో ఆటో డ్రైవర్లు ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ తమ వాయిదా తీర్మానంలో పేర్కొంది. కాబట్టి ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా ప్రతి ఆటోడ్రైవర్‌కు ఏటా 12వేల రూపాయలు ఆర్థిక సాయం అందించాలని పేర్కొంది. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ.. దీనిపై అసెంబ్లీలో చర్చించాలని ప్రతిపాదించింది.

## తెలుగోడి సాహిత్య సేవకు పట్టం..

(మొదటి పేజీ తరువాయి)
అంతేకాదు ఆయన అభ్యుదయ కవి. శ్రామిక పక్షపాతిగా పేరు గాంచారు. ప్రస్తుతం అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శిగాను, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగాను పనిచేస్తున్నారు. 2023లో జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు. 1972 నుంచి అభ్యుదయ రచయితల సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. 1972లో సమిధ అనే కవితతో తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. వివిధ విమర్శనా గ్రంథాలను, సాహిత్యవ్యాసాల సంపుటి , కవిత్వాన్ని రచించారు. ఇప్పటికే ఆయన తెలుగు భాషాపురస్కారం, సుంకర సత్యనారాయణ స్మారక పురస్కారం, మిలీనియం లాయర్ పురస్కారం లను అందుకున్నారు. లక్ష్మీ నారాయణ 1954, అక్టోబర్ 24వ తేదీన గుంటూరు జిల్లా నూజెండ్ల మండలం చెరువుకొమ్ముపాలెం గ్రామంలో గోవిందరెడ్డి, లింగమ్మ దంపతులకు జన్మించారు. మధ్యతరగతి కుటుంబం.. తండ్రి ఓ సామాన్య రైతు.. బిఎ డిగ్రీ చదివిన తర్వాత బీఎల్ చేశారు. గుంటూరులో న్యాయవాద వృత్తిని చేపట్టారు. భార్య పేరు గీత, టీచర్ గా పనిచేస్తున్నారు. ఈ దంపతులకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 21 భాషలకుగాను కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలను సాహిత్య అకాడమీ ప్రకటించింది. బెంగాలీ, ఉర్దూ, డోగ్రి భాషలకు సంబందించిన అవార్డులను త్వరలో ప్రకటించనున్నారు. పురష్కరాలకు ఎంపికయిన రచయితలకు వచ్చే సంవత్సరం దేశ రాజధాని ఢిల్లీలో ఈ పురష్కరాలను అందజేయనుంది. శాలువా తో సన్మానం చేసి ఆ అవార్డు కింద లక్ష రూపాయల నగదును బహుమతిగా అందజేయనున్నారు. ఈ అవార్డ్ కోసం తెలుగు బాష నుంచి మొత్తం 14 పుస్తకాలను సిఫార్స్ చేసినట్లు.. అందులో దీపిక' అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటిక ఎంపికఅయినట్లు తెలుస్తోంది.

## మాల్యా ఆస్తులు అమ్మి బ్యాంకులకు జమ

(మొదటి పేజీ తరువాయి)
ఈడీ అధికారులు విక్రయించారని వివరించారు.మరో వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీకి చెందిన రూ.2,566 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిందని, ఈ ఆస్తులను కూడా వేలం వేసేందుకు స్పెషల్ కోర్టు అనుమతిచ్చిందనినిర్మలా సీతారామన్ చెప్పారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి తీసుకున్న సుమారు 13 వేల కోట్లకు పైగా రుణాలను చోక్సీ చెల్లించలేదని తెలిపారు. దీంతో ఈడీ జప్తు చేసిన ఆస్తులను వేలం వేసి పంజాబ్ నేషనల్ బ్యాంకుతో పాటు ఇతర రుణదాతలకు చెల్లించాలని ముంబై స్పెషల్ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. పీఎంఎల్ఏ చట్టం ఆధారంగా రుణాల ఎగవేతదారుల నుంచి సొమ్ము రాబడుతున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ భగ్గు

### పార్లమెంట్ ఆవరణ ముందు అంబేడ్కర్ చిత్రాలతో నిరసన



న్యూఢిల్లీ, డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త): కేంద్ర హోం మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలంటూ ప్రతిపక్ష కూటమి ఇండియా బ్లాక్ బుధవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక సహా పలువురు ఎంపిలు ఈ నిరసనలో పాల్గొన్నారు. అంబేద్కర్ చిత్రపటాలతో చేబూని, జై భీమ్, అమిత్‌షా క్షమాపణలు చెప్పాల్సిందే అంటూ నినాదాలు చేశారు. కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఆర్‌జెడి, డిఎంకె, ఆప్ పార్టీలు ఆందోళన చేపట్టాయి. మనుస్మృతిని విశ్వసించే వారు అంబేద్కర్‌తో విభేదిస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కూడా అమిత్‌షాపై విరుచుకుపడ్డారు. హోం మంత్రి బాబాసాహెబ్‌ను అవమానించడం ద్వారా బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ జాతీయ పతాకానికి వ్యతిరేకమని, వారి పూర్వీకులు ఆశోక చక్రాన్ని వ్యతిరేకించారని మరోసారి రుజువైంది. భారత రాజ్యాంగానికి బదులు మనుస్మృతిని తొలిరోజు నుండే అమలు చేయాలని సంఘ్‌పరివార్ భావిస్తోందని అన్నారు. 'నాలాంటి కోట్లాది మంది ప్రజలకు అంబేద్కర్ భగవంతుడి కంటే తక్కువేమీ కాదు. దళితులు, గిరిజనులు, మైనారిటీలు, వెనుకబడిన తరగతులు , పేదలకు ఆయన ఎప్పటికీ గొప్పవాడేనని బిజెపి నేతలు అర్థం చేసుకోవాలి' ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. మంగళవారం రాజ్యసభలో చర్చ నేపథ్యంలో అంబేద్కర్‌ను ప్రస్తావిస్తూ అమిత్ షా చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతోన్న సంగతి తెలిసిందే. హోంమంత్రి వ్యాఖ్యలను విపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. అంబేద్కర్ చిత్రాలు ప్రదర్శిస్తూ పార్లమెంట్ ప్రాంగణంలో ఎంపీలు నిరసన తెలిపారు. అలాగే అమిత్ షా రాజీనామాను డిమాండ్ చేశాయి. ఆ నిరసనల్లో రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు.

## ధరణి స్థానంలో భూ భారతి

(మొదటి పేజీ తరువాయి)
18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి భూభారతి తీసుకొచ్చాం. ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమిస్తాం. భూ వివాదాలపై అప్పీలుకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేస్తాం. అనుభవదారుల కాలాన్ని కూడా ఈ కొత్త బిల్లులో పొందుపరిచాం. 33 మాడ్యూల్స్‌తో ఉన్న దాన్ని 6 మాడ్యూల్స్‌తో పునఃప్రక్షాళన చేస్తున్నాం'అని పొంగులేటి సభలో వివరించారు. తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్ -భూభారతి చట్టాన్ని రూపొందించామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఇటువంటి అద్భుతచట్టాన్ని ప్రవేశపెట్టే అవకాశం తనకు లభించడం మరచిపోలేని విషయమని అన్నారు. 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయ్యిందని తెలిపారు. తర్వాత అర్ధరాత్రి నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం వలన సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని చెప్పారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణి పోర్టల్‌తో లెక్కలేనన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు. లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత , నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఆమేరకు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, ఒక్క గుంట భూమి ఉన్న వారు కూడా తమను నమ్మారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకుగాను ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు. తాము ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమేగాక ప్రత్యేకంగా 40 రోజుల పాటు వెబ్ సైట్‌లో పెట్టి ప్రజాప్రతినిధులు,కవులు , మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని తెలిపారు. మాజీ మంత్రి హరీష్ రావు 7 పేజీలు, వినోద్‌రావు 5 పేజీల సలహాలు . సూచనలు చేశారని వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. 33 జిల్లాలలో ఒక్కోరోజు ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. ధరణ కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేసముద్రం మండలం నారాయణపురంలో కె. రవి అనే ఎంపీటీసీ సభ్యులు భూ సమస్‌లలను బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని , ఏళ్ల తరబడి పరిష్కారం కాలేదని చెప్పారు. అంతేగాక సర్వేనెంబర్లు 149,150, 154,156, 168 తదతరాల్లోని 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ధరణి -2020 ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని మంత్రి వివరించారు.

## సముద్రంలో ఫెర్రీని ఢీకొట్టిన స్పీడ్ బోటు

### పలువురు పర్యాటకుల గల్లంతు 21మందిని రక్షించిన కోస్ట్‌గార్డ్ సిబ్బంది



ముంబై డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని గేట్‌వే ఆఫ్ ఇండియా సమీపంలోని సముద్రంలో ప్రయాణికులతో నిండిన పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో బోటులో ఉన్న ప్రయాణికులంతా నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు మరో బోటులో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బోటులో 60 మంది వరకు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం వారిని రక్షించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే కొంత మందిని రక్షించారు. ఒకరు మృతి చెందినట్లు సమాచారం. ముంబై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ పడవ గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి ఎలిఫెంటా వైపు వెళుతోంది. బుధవారం(డిసెంబర్ 18) మధ్యాహ్నం ఈ ఘటన జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆ సమయంలో అస్పష్టమైన వాతావరణం కారణంగా, పెద్ద సంఖ్యలో పర్యాటకులు గేట్‌వే ఆఫ్ ఇండియాకు చేరుకున్నారు. వీరిలో చాలా మంది బోటింగ్‌కు కూడా సముద్రంలోకి వెళ్లారు. కొందరు పర్యాటకులు స్పీడ్ బోటులో ఎలిఫెంటా వైపు వెళ్తున్నారని ప్రత్యక్ష సాక్షి ఒకరు తెలిపారు. వారి పడవ ఒడ్డు నుంచి 50 మీటర్ల లోపలికి వెళ్లగానే ఒక్కసారిగా ఏదో జరిగి మునిగిపోవడం ప్రారంభించింది. యాదృచ్ఛికంగా, ఒక పెద్ద పడవ అక్కడికి చేరుకుంది. మునిగిపోతున్న పడవ నుండి కొంతమంది ప్రయాణికులను పెద్ద పడవలోకి తీసుకువెళ్లారు. ముంబై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సమాచారం అందుకున్న వెంటనే, అనేక ఇతర బోట్లతో సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ప్రమాదంలో ఒకరి మృతి చెందగా, 21 మందిని కోస్ట్‌గార్డ్ రక్షించింది. మిగిలి ప్రయాణీకులను రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాద సమయంలో పడవలో 66 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, బోటులో ఎంతమంది ప్రయాణికులు ఉన్నారనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు అధికారులు గల్లంతైన వారి ఆచూకీ కోసం మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం డైవర్ల బృందాన్ని సముద్రంలోకి దింపారు.

## మళ్లీ పెళ్లి చేసుకున్న మహిళకు చనిపోయిన భర్త ఆస్తిలో వాటా

### మద్రాసు హైకోర్టు సంచలన తీర్పు

మద్రాసు,డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
భర్త మరణించిన తర్వాత మళ్లీ పెళ్లి చేసుకున్న మహిళకు చనిపోయిన తన భాగస్వామి ఆస్తిలో వాటా ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. హిందూ వివాహ చట్టం కింద మరణించిన తన భర్త ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరాకరించే నిబంధనేదీ లేదని ఓ కేసు విషయంలో వ్యాఖ్యానించింది. తమిళనాడులోని సేలం ప్రాంతానికి చెందిన మల్లిక అనే మహిళ భర్త చిన్నయ్యన్ కొంత కాలం క్రితం మరణించారు. ఆ తర్వాత ఆమె మళ్లీ పెళ్లి చేసుకున్నారు. అయితే ఆమెకు చనిపోయిన తన భర్త ఆస్తిలో వాటా ఇచ్చేందుకు చిన్నయ్యన్ కుటుంబసభ్యులు నిరాకరించారు. ఆ విషయంలో మల్లిక సేలం జిల్లా కోర్టును ఆశ్రయించారు. అక్కడ ఆమెకు నిరాశ ఎదురైంది. దివంగత భర్త ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరోధించడానికి ఆమె పునర్వివాహం ఒక కారణమని పేర్కొంది జిల్లా కోర్టు.ఆ తర్వాత దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ వేశారు మల్లిక. విచారణకు స్వీకరించిన హైకోర్టు, దిగువ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది. హిందూ వివాహ చట్టం- మహిళ పునర్వివాహం చేసుకున్నా, మరణించిన ఆమె భర్త ఆస్తిని వారసత్వంగా పొందే హక్కును కల్పిస్తుందని తెలిపింది. మళ్లీ వివాహం చేసుకున్నారనే సాకుతో ఆస్తిని వారసత్వంగా పొందకుండా నిరాకరించే నిబంధన ఏదీ లేదని కోర్టు చెప్పింది. అలాంటి నిబంధన 2005లో రద్దు అయిందని గుర్తు చేసింది. వారసత్వంలో సమానత్వం పాటించాలనే సూత్రాన్ని హైకోర్టు సమర్థించింది. ఆస్తి విషయంలో మహిళలకు సమాన హక్కులు ఉంటాయని గుర్తు చేసింది.

# హాస్టల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేసిన కాంగ్రెస్ నాయకులు

**పర్వతగిరి, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండల కేంద్రంలోని ఎస్టీ గురుకుల పాఠశాలను కాంగ్రెస్ మండల నాయకులు సందర్శించారు. బుధవారం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జాటోత్ శ్రీనివాస్ నాయక్ పలువురు నాయకులతో కలిసి హాస్టల్లో మధ్యాహ్నం భోజన సమయానికి హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. మెనూతో పాటు వంటలను పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. డిటిడబ్ల్యూ అధికారితో కలిసి హాస్టల్ తనిఖీ చేశారు. అనంతరం హాస్టల్లో విద్యార్థులకు కావలసిన అత్యవసరాలు, నిత్యవసరాలు పై ఆరా తీసి, విద్యార్థులతో పాటు భోజనం చేశారు. విద్యార్థుల కోసం 40 శాతం మెస్ చార్జీ



పెంచి, నాణ్యమైన భోజనం, కూరగాయలు, పండ్లు, పాలు, పెరుగు, అందించే విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ గత 10 సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేద విద్యార్థులను పట్టించుకోలేదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, విద్యార్థులకు నాణ్యతమైన విద్య అందించాలని, ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. బడుగు బహీన వర్గాల ఆశాజ్యోతి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు నియోజకవర్గ పరిధిలోని హాస్టళ్ళు, పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల అవసరాల మేరకు కృషి చేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే బడుగు, బలహీన, వర్గాల ప్రభుత్వమని శ్రీనివాస్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యులు ఎండి సర్వర్, పర్వతగిరి టౌన్ అధ్యక్షులు కుసం రామచందర్, మాజీ ఉప సర్పంచ్ రంగు జనార్ధన్, ఎస్టీసెల్ అధ్యక్షులు భాస్కర్ నాయక్, బొట్ల వెంకటేశ్వర్లు, వంగ సాయికుమార్, మంద రవి, గ్రామ పార్టీ అధ్యక్షులు మంగ్య నాయక్, తిరుపతి నాయక్, జంగ సాంబయ్య, వీరితోపాటు గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, వార్డెన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## భద్రకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న వరంగల్ మున్సిపల్ కమిషనర్



వరంగల్ బ్యూరో, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని బుధవారం వరంగల్ మున్సిపల్ కమీషనర్ అశ్విని తానాజీ వాకడే కుటుంబ సమేతంగా సందర్శించారు. భద్రకాళి దేవాలయం కార్యనిర్వహణ అధికారి/ సహాయ కమిషనర్ కె. శేషుభారతి తెలిపిన వివరాల ప్రకారం ఆలయానికి విచ్చేసిన మున్సిపల్ కమీషనర్ కుటుంబ సభ్యులకు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు, పర్యవేక్షకులు అద్దంకి విజయ్ కుమార్, అర్చకులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి పత్యేక పూజలు చేయించుకున్నారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి, ప్రసాదములు అందజేశారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



రాయపర్తి/డిసెంబర్ 18(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని ఏకే తండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ఎస్టీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి మాలోత్ వసుంధర్ నాయక్ తండ్రి మాలోత్ చంధ్య నాయక్ అనారోగ్యంతో మరణించగా బుధవారం వారి పార్థివా దేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళ్ళు అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి,జినుగు అనిమి రెడ్డి,రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ సెల్ మండల అద్యక్షుడు జాజు నాయక్,మండల నాయకులు ఏలమంచి శ్రీనివాస్ రెడ్డి, భాషబోయిన సుధాకర్,

## గాయపడిన గీత కార్మికున్ని పరామర్శించిన రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్

వర్ధన్నపేట, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు ముత్యం ఏకాంబ్రం గౌడ్ బుధవారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి జారీ పడ్డారు. ఈ ప్రమాదంలో తన రెండు చేతులు పూర్తిగా విరిగిపోయి, తీవ్ర గాయాల పాలయ్యారు. సమాచారం తెలుసుకున్న తెలంగాణ గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు నరేష్ గౌడ్ గాయపడి చికిత్స పొందుతున్న ఏకాంబరం ను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితిల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే వహించాలని, బాధితుడికి భార్య, చదువుకునే ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. వారికి ప్రభుత్వమే అండగా ఉండాలని కోరారు. అంతేకాకుండా తన వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, ఇది ప్రభుత్వ వైఫల్యమని దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ డిక్లరేషన్ లో ప్రభుత్వం ఏర్పాటు కాగానే గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలు అందిస్తామని చెప్పి,



అధికారం వచ్చి సంవత్సరం గడిచిన ఇచ్చిన హామీలు ఒక శాతం కూడా అమలు చేయలేదని ధ్వజమెత్తారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గీత కార్మికుల పైన దాడులు మానుకొని, గీత కార్మికుల రక్షణకై నడుంబించాలని, కలుగీత కార్పోరేషన్ తక్షణమే ఏర్పాటు చేయాలని అన్నారు. బాధితుడికి రెండు చేతులు విరిగి నరాలు తెగినందున ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు, కావున తన వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరించి, 10 లక్షల రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా గీత కార్మికుల రక్షణ కవచాలు పూర్తిస్థాయిలో అందించాలని, లేనియెడల తెలంగాణ గౌడ యువజన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఎక్సైజ్ ఆఫీస్ వద్ద ఆందోళనలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గతంలో ఎక్సైజ్ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కల్లుగీత ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, రాష్ట్రంలో ఏ గీత కార్మికుడైన ప్రమాదవశాత్తు చెట్టు పై నుండి పడితే 24 గంటల్లో తక్షణ సహాయం 25 వేల రూపాయలు అందించడమే కాకుండా, వారికి ప్రభుత్వం నుంచి రావలసిన నష్టపరిహారాన్ని రెండు నెలలలో అందించేవారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన దగ్గర నుండి ప్రమాదవశాత్తు గాయపడిన, మరణించిన గీత కార్మికులకు అందవలసిన తక్షణ నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో రోజుకు పదుల సంఖ్యలో గీతా కార్మికులు ప్రమాదానికి గురి అవుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేసి గీత కార్పొరేషన్ ను ఏర్పాటు చేయకుంటే రాబోయే స్థానిక ఎన్నికలలో గౌడ జాతి మోకు దెబ్బ రుచి చూపిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. పరామర్శించిన వారిలో గౌడ సంఘం నాయకులు చెంగల ఏకాంబరం గౌడ్, సాగర్ గౌడ్, జిల్లా గౌడ సంఘం నాయకులు తదితరులు పరామర్శించారు.

## బిజెపి పార్టీ బూత్ అధ్యక్షుల ఎన్నిక



రాయపర్తి/డిసెంబర్ 18(జర్నలిస్ట్ వార్త): మండలంలోని పెరికేడు గ్రామంలో బిజెపి సభ్యత్వ నమోదులో భాగంగా మండల పార్టీ అధ్యక్షులు నూనె అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో బూత్ అధ్యక్షులను బుధవారం ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అసెంబ్లీ కో కన్వీనర్ సుంకరనేని కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా ప్రతి ఆరు సంవత్సరాలు ఒకసారి సభ్యత్వం కార్యక్రమం నిర్వహించి తదనంతరం బూత్ అధ్యక్షులను మండల అధ్యక్షులను జిల్లా అధ్యక్షులను రాష్ట్ర అధ్యక్షులను ఎన్నుకుంటారని అన్నారు. భారతీయ జనతా పార్టీ సిద్ధాంతమని బూతులలో పార్టీ ఎంత పటిష్టంగా ఉంటే అంతా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం కలిగిన పార్టీ ఏదైనా ఉందంటే అది భారతీయ జనతా పార్టీ అని అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రతి రాష్ట్రంలో ప్రతి గ్రామానికి భారతీయ జనతా పార్టీ విస్తరించిందని తెలంగాణలో కూడా భారతీయ జనతా పార్టీ రానున్న రోజుల్లో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు భూత్ అధ్యక్షులను ఎన్నుకోవడం జరిగింది 179 బూతు అధ్యక్షులుగా కూన యాదగిరి ని 181 బూతు అధ్యక్షులుగా రాసాల రాకేష్ యాదవ్ గారిని 182 బూతు అధ్యక్షులుగా రాజు గారిని ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎనగందుల శ్రావణ్ కుమార్ శక్తి కేంద్ర ఇన్చార్జ్ నిమ్మల అనిల్ మండల ప్రధాన కార్యదర్శి సుధాకర్ యూవ మోర్చా మండల అధ్యక్షులు మంచాల సుమన్ యాదవ్ కార్యకర్తలు రాకేష్ నిఖిల్ రామకృష్ణ సంపత్ సాయి కుమార్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి నిత్యవసర వస్తువులు అందజేత



రాయపర్తి/డిసెంబర్ 18(జర్నలిస్ట్ వార్త): మండలం లోని మైలారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఎండీ మధార్ భార్య సైదాబి ఇటీవల అనారోగ్యంతో మరణించగా మంగళవారం మృతురాలి వారి కుటుంబానికి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో 50 కేజీల బియ్యం నిత్యవసర వస్తువులను బిఆర్ఎస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలమంచి శ్రీనివాస్ రెడ్డి,మండల పార్టీ నాయకులు లేతాకుల రంగా రెడ్డి, బిల్లా వెంకట్ రెడ్డి, లేతకుల సుధాకర్ రెడ్డి,ఆశ్రఫ్ పాషా, బైరు యాకన్న, గుడెల్లి వెంకటయ్య, గాడిపెల్లి రాములు, సంకినేని ఎల్లస్వామి, కోలా సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## హైమాక్స్ లైటును ప్రారంభం ఆడే గజేందర్







బోథ్/ డిసెంబర్18 (జర్నలిస్ట్ వార్త): గ్రామాల అభివృద్దే లక్ష్యంగా ముందుకు పోవడం జరుగుతుందని ఆడే గజేందర్ అన్నారు. బుధవారం నేరేడిగొండ మండలంలోని రాజుల తాండ గ్రామంలో హైమక్స్ లైట్ ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు అనంతరం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు గ్రామస్తులు మాట్లాడుతూ హనుమాన్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానా పత్రిక అందించడానికి వచ్చిన గ్రామస్తులు ఆలయాన్ని వద్ద చీకటి మయంగా ఉంది అని కోరగా వెంటనే స్పందించిన ఆడే గజేందర్ వారం రోజుల్లోగా హైమాక్స్ లైట్ ఏర్పాటుచేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు .ఆయన వెంట మండల అధ్యక్షులు ఆడే వసంతరావు యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కపిల్ దేవ్ మౌలానా కర్తార్ ,అశోక్, సంతోష్, ప్రకాష్,పెద్ద కాపు గ్రామస్తులు తదితరులున్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నల్లగొండ/ డిసెంబర్ 18 (జర్నలిస్ట్ వార్త): మిర్యాలగూడ డివిజన్ ట్యాంక్ తండ గ్రామ వాస్తవ్యులు గుగులోతు సునీత, హుస్సేన్ కి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు ను ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆదేశానుసారం బుధవారం కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబం నివాసానికి వెళ్లి చెక్కు అందజేశారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు భాస్కర్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిది అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాస్కర్,మాలోతు రమేష్, బలరాం, రాజ్యాలు, తదితరులు ఉన్నారు.

## నూతన సీఐ ని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు




**బోథ్/ డిసెంబర్18 (జర్నలిస్ట్ వార్త):** బోథ్ నూతన సీఐ వెంకటేశ్వర్ ల ని కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం సీఐ తో మాట్లాడుతూ స్థానిక సమస్యలపై చర్చించి మాదక ద్రవ్యాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలనికోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం మాదక దృవ్యాల వాడకం ను ఉక్కుపాదం తో అణచివేసి యువతను సరైన మార్గం లో నడిపించేందు కు ప్రతి ఒక్కరు నడుంబింగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీటీసీ లు షేక్ రజియా బేగం,కుర్మే మహేందర్,వీడీసీ అధ్యక్షులు గంగాధర్, మాజీ వార్డు సభ్యులు షేక్ షాకీర్, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, రాజు, సాయన్న, ఉమేష్,మైనారిటీ నాయకులు హసీబ్, షహీద్ తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



రాయపర్తి/డిసెంబర్ 18(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బండ ప్రకాష్ ముదిరాజ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో బుధవారం ముదిరాజ్ సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా ముద్రబోయిన వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శిగా కనుకుంట్ల లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా షాపురం సాయిలు,కాగిత వెంకన్న,కనుకుంట్ల యాకయ్య,మండల యూత్ అధ్యక్షులుగా నరసింహుల రమేష్,ప్రధాన కార్యదర్శిగా బాద సుధాకర్ ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముదిరాజ్ లు కులస్తులు ఆర్థికంగా బలోపేతం చేయడం కోసం కృషి చేస్తానని తెలిపారు.తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి,మచ్చ పారిశ్రామిక సంఘం జిల్లా చీఫ్ ప్రమోటర్ సొప్పరి సోమయ్య,జిల్లా ప్రధాన కార్యదర్శి నిరటి సదానందం,జిల్లా యూత్ అధ్యక్షుడు అమర్,ఎన్నారై విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ రాజ్ కుమార్.మత్స్యశాఖ జిల్లా డైరెక్టర్ చెవ్వ కాశినాదం తదితరులు పాల్గొన్నారు.

# పట్టు సాగుతో తక్కువ పెట్టుబడి ఎక్కువ లాబాలు

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా





వరంగల్ బ్యూరో, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): పట్టు సాగు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని, ఆ దిశగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పేర్కొన్నారు. బుధవారం వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని దర్శుతాండ గ్రామంలో పట్టు పరిశ్రమ సాగు షెడ్డు నిర్మాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాంప్రదాయ పంటలు వేసి నష్టపోకుండా ఆదాయం వచ్చే పట్టు సాగు చేపట్టాలని, గ్రామ రైతులు పంట మార్పిడి చేయాలని సూచించారు. పట్టు పరిశ్రమ అధికారులను శాస్త్రవేత్తలను సంప్రదించి వారి సూచనల మేరకు పట్టు పురుగుల పెంపకంలో పాటించాలన్నారు. కర్ణాటక రైతుల వలె పెట్టుబడితో అధిక లాభం పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పట్టు పరిశ్రమ సంయుక్త సంచాలకులు అనసూయ సహాయ పట్టు పరిశ్రమ అధికారి అరవింద్, సంపత్, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గజేందర్ ని కలిసిన తేజాపూర్ గ్రామస్తులు



బోథ్/ డిసెంబర్18 (జర్నలిస్ట్ వార్త): నేరేడిగొండలోని. పార్టీ కార్యాలయంలో తేజాపూర్ ఓసీ (రెడ్డి )సంఘు సభ్యులు మర్యాదపూర్వం కలిసి సన్మానించారు .ఓసీ (రెడ్డి) ఫంక్షన్ హాల్ పనులు అసంపూర్తిగా ఉందని అన్నారు ఆడే గజేందర్. స్పందిస్తూ వెంటనే పనులు ప్రారంభమయ్యే విధంగా చూస్తానని హామీ. ఇచ్చారు కలిసిన వారిలో సంఘు సభ్యులు ఉన్నారు.

# నూతన సీఐ ని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ బీఆర్ఎస్ నాయకులు



బోథ్/ డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త): బోథ్ మండలనికి బదిలీ పై వచ్చిన నూతన సీఐ వెంకటేశ్వరావు ని బుధవారం బోథ్ మండల బీ అర్ ఎస్ నాయకులు శాలువా తోగంఘూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు శ్రీధర్ రెడ్డి, సురేందర్ యాదవ్,పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్ ,రైతు సంఘం అధ్యక్షులు బోడ్డు శ్రీనివాష్ డాక్టర్ స్వామి,గంగమల్లు ,రాకేష్, ఈశ్వర్,మాజీ సర్పంచ్ లు,మాజీ ఎంపీటీసీ లు ,మాజీ వర్డ్ మెంబర్ లు బీ అర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# బడుగుల ఆత్మగౌరవాన్ని పెంచడంకోసమే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

## -కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి



బోథ్ /డిసెంబర్18 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా బడుగుల ఆత్మగౌరవాన్ని మరింత పెంచే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టబోతుందని, దానికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరూ సహకరించి ఇందిరమ్మ ఇంటి సర్వేకు వస్తున్న అధికారులకు సహకరించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పిలుపునిచ్చారు. బుధవారం వారు మాట్లాడుతూ అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా దాదాపు ఒక్కో నియోజకవర్గానికి 3500 చొప్పున, ఐటిడిఏ తరపున అదనంగా మరో 2000 వరకు ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు.జిల్లా ఇన్చార్జి మంత్రి ఆదేశాల మేరకు పారదర్శకంగా సర్వే చేపడుతున్నారని, ఎస్సీ ఎస్టీలకు ఇంటి నిర్మాణానికి ఆరు లక్షల రూపాయలు, మిగతా వారికి ఐదు లక్షల రూపాయలతో ఇంటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. సర్వేకు వస్తున్న అధికారులకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో వాజిద్, ధన్నూర్ బి పంచాయతీ కార్యదర్శి శిరీష, యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ఎల్మ వినయ్ రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఘాట్ తొలగించాలన్న కోమటిరెడ్డి తీరుపై భగ్గుమన్న

## తల్లాడ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు

తల్లాడ/డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
హైదరాబాద్ లో ఎన్టీఆర్ ఘాట్ స్థానంలో నూతన అసెంబ్లీ నిర్మాణం చేయాలనే కోమటిరెడ్డి రాజ గోపాలరెడ్డి వ్యాఖ్యలపై తల్లాడ మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు భగ్గుమన్నారు. బుధవారం బాలయ్య అభిమానులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి పాలాభిషేకం చేశారు. ఎండి బాబు ,మాట్లాడుతూ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వాక్యాల్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని,లేకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎవరితోనైనా పెట్టుకోండి గాని నందమూరి అభిమానులు, తెలుగుదేశం పార్టీ అభిమానులతో పెట్టుకుంటే ఎలా ఉంటదో మేము చూపిస్తాం అని, ఒక్కసారి ఎన్టీఆర్ ఘాట్ ని టచ్ చేసి చూడండి, అప్పుడు పరిణామాలు ఎలా ఉంటాయో మీకే తెలుస్తదని హెచ్చరించారు. అనుచిత వాక్యాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మొక్క కృష్ణార్జున,వెంకటేశ్వర్లు, తెలుగు యువత నర్సిరెడ్డి పోతురాజు కృష్ణ రావూరి రవి ప్రసాద్ రాజు రామారావు వెంకటి తెలుగు మహిళ నాయకురాలు కృష్ణవేణి కిట్టమ్మ క్రిష్ణ,నరేష్,నాగేశ్వరావు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రాజకీయాల్లో నారపోగు వెంకట్



తల్లాడ/డిసెంబర్18(జర్నలిస్ట్ వార్త):
తల్లాడ మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నారపోగు వెంకట్ రాష్ట్ర రాజకీయాల్లో తన పాత్రను పోషిస్తున్నారు. గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి నుండి రాజకీయ విశ్లేషకులుగా రాష్ట్ర రాజకీయాల్లో తన వానిని వినిపిస్తున్నారు. ఓ టీవీ ఛానల్ లో రాజకీయ విశ్లేషణ కర్తగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రతిపక్ష పార్టీలపై విమర్శనాస్త్రాలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలతోపాటు సంవత్సరం కాలంగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల కళ్ళకు కట్టినట్లుగా వివరించారు. అదేవిధంగా ప్రతిపక్షాలకు కౌంటర్ ఇస్తూ గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. నారపోగు వెంకట్ రాజకీయ నాయకుడిగా కాకుండా జర్నలిజంలో ఎంసీఏ పూర్తి చేసి అన్ని విషయాలపైన అవగాహన కలిగి ఉన్నాడు. సర్పంచ్ ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవితో పాటు సర్పంచ్ పదవి కాలం పూర్తయిన వెంటనే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అనుచరుడుగా హైదరాబాదులో ఉంటూ రాజకీయాలు చేస్తున్నారు. అంతేకాకుండా సత్తుపల్లి నియోజకవర్గంలో దళిత నేతగా ఎదుగుతున్నారు. గ్రామీణ స్థాయి నుండి అంచెలంచెలగా ఎదిగి రాజకీయ విశ్లేషకులుగా నాయకులుగా రాణిస్తున్న వెంకట్ కు రానున్న రోజుల్లో ఎటువంటి పదవులు వరిస్తాయో వేచి చూడాల్సిందే మరి.

# యువత రాజకీయాల్లో రాణించాలి

## -తెలుగు యువత నాయకుడు పొగాకు జయరాం.

## -పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం.






ఖమ్మం/డిసెంబర్ 18(జర్నలిస్ట్ వార్త):
ఖమ్మం జిల్లా బోనకల్ యువత రాజకీయాల రాణించడం ద్వారా రాబోయే తరానికి బలమైన నాయకత్వాన్ని అందించవచ్చని తెలంగాణ తెలుగుదేశం పార్టీ తెలుగు యువత నాయకుడు పొగాకు జయరాం, ఖమ్మం జిల్లా పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని సాయిబాబా కళ్యాణ మండపంలో తెలుగు యువత జిల్లా నాయకుడు భాగం రాకేష్ అధ్యక్షతన ఖమ్మం పార్లమెంటరీ స్థాయి తెలుగు యువత సమావేశం నిర్వహించడం జరిగినది. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని, పార్టీకి పునర్నిర్మాణం దిశగా అడుగులు వేస్తున్నామని,యువత రాజకీయాల్లో రాణించడం ద్వారా బలమైన నాయకత్వాన్ని తయారు చేయవచ్చున్నారు. తెలుగుదేశం పార్టీ సభ్యత కార్యక్రమంలో యువత చురుగ్గా పాల్గొనాలని, 2029 సంవత్సరంలో తెలంగాణలో అధికారం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు యలమంచిలి శివ చౌదరి,రావుట్ల సత్యనారాయణ, నందమూరి సత్యనారాయణ, భాగం రమేష్ నున్న తాజుద్దీన్,తెలుకుంట శ్రీను, తుళ్లూరు కొండలరావు పాపినేని వెంకటయ్య,మైనేని రవి కుమార్,మండేపూడి గోర్కే,గొల్లపల్లి నాగమల్లేశ్వరరావు, మందా నరేందర్ పారా వెంకటేశ్వరరావు,మరీదు బరకయ్య, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను

# పర్యటించిన వరంగల్ జిల్లా డిఎంహెచ్ఓ





వరంగల్ బ్యూరో, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త):
వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పర్యటించారు. బుదవారం కాపుల కనపర్తి, గవిచర్ల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నెక్కొండ, అలంకానిపేట లలో పర్యటించి, వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలు, సమయపాలన గూర్చి వివరించారు. సాధారణంగా చలికాలంలో చిన్నపిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు ముక్కు కారడము, అస్తమ, శ్వాసకోస వ్యాధులు, హార్ట్ ఎటాక్స్ ,చర్మ సంబంధిత వ్యాధులు ఎక్కువగా వచ్చే అవకాశము ఉంటుంది. కాబట్టి ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్న పిల్లలకు, వృద్ధులకు షెటర్స్, గ్లౌజెస్, దుప్పట్లు నిండుగా కప్పుకొని చలికి గురి కాకుండా ఉండాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని ఆదేశించారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని కోరినారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారు అందువల్ల సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిప్యూటీ డిఎండిఓ డాక్టర్ ప్రకాష్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ రహేలా తస్వీర్, డాక్టర్ సుమన్, డాక్టర్ అర్చన, డాక్టర్ అఖిల్, పల్లె దావకాన డాక్టర్లు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హనుమకొండకు చేరుకున్న జస్టిస్ షమీమ్ అక్తర్

## - ఘనంగా స్వాగతం పలికిన వరంగల్, హనుమకొండ కలెక్టర్లు





వరంగల్ బ్యూరో, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): ఎస్సీ వర్గీకరణ అంశంపై విచారణ చేపట్టేందుకు వరంగల్ జిల్లాకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ కు బుధవారం జిల్లా అధికారులు ఘణ స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్ హనుమకొండ లోని హరిత కాకతీయ హోటల్ చేరుకున్నారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు వారిని కలిసి మొక్కలను అందించి స్వాగతించారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా కు సంబంధించి ప్రజలు, వివిధ వర్గాల నుండి వినతులు, అభిప్రాయాలను జస్టిస్ షమీమ్ అక్తర్ సేకరించనున్నారని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



# కలెక్టరేట్లో లే అవుట్ కమిటీ సమావేశం

వరంగల్, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ జిల్లాలో లేఅవుట్ అనుమతుల కోసం బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ లో లేఆవుట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ పరిధిలో లే అవుట్ అనుమతుల కోసం ప్రతిపాదన రాగా వాటిపై కమిటీ సమావేశంలో చర్చించి అనుమతి మంజూరు చేశారు. ఈ సమావేశంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిటిసిపి రత్న కుమారి, జిడబ్ల్యూ ఎంసీ ఆదనవు కమిషనర్. జోనా సిటీ ప్లానర్ రవీందర్, జిల్లా రోడ్ల భవనాల అధికారి జితేందర్ రెడ్డి, డిసిసిపి సాగునీటిపారుదల శాఖ, ల్యాండ్స్ సర్వే విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

## - వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి






వరంగల్ బ్యూరో, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): జిల్లా ఆర్థిక ప్రగతిలో బ్యాంకర్ల భాగస్వామ్యం, సహకారం అవసరమని వరంగల్ జిల్లా ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి తెలిపారు. రుణ లక్ష్యాలు బ్యాంకర్లు పూర్తి చేయాలని కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి డీసీసీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ స్వయం ఉపాధి పథకాల అమలు, రుణాల మంజూరు, గత త్రైమాసికంలో సాధించిన ప్రగతిపై బ్యాంకులు, ప్రభుత్వ శాఖల వారీగా అదనపు కలెక్టర్ సమీక్షించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణాలకు గాను 1802.08 కోట్ల రూపాయలు రైతులకు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటి వరకు 1231 కోట్ల రూపాయలు అందించారని వివరించారు. వ్యవసాయ రంగంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను 3785.18 కోట్ల రూపాయలు లక్ష్యంగా పెట్టుకోగా, సెప్టెంబర్ వరకు రూ.2136 కోట్లు అందించినట్టు తెలిపారు. భారీ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు 997.63 కోట్ల రూపాయలకు గాను రూ. 765 కోట్లు, ప్రాధాన్యత ఉన్న రంగాలకు రూ. 4891.15 కోట్లకు గాను రూ. 3008 కోట్లు అందించినట్టు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు రూ. 628 కోట్లకు గాను రూ. 492 కోట్లు ఇచ్చినట్టు పేర్కొన్నారు. సెప్టెంబర్ 2024 వరకు 9536 మంది లబ్ధిదారులకు 100 కోట్లు ముద్ర రుణాలు అందించినట్లు తెలిపారు. పీఎం ఈజిపి, పీఎం ఎఫ్ ఎం ఈ, స్టాండ్ అప్ ఇండియా, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, విద్య విద్య రుణాల లాక్ష్యాలను సాధించాలని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, డీసీసీ కన్వీనర్ ఎల్డీఎం యూబీఐ హావేలి రాజు, యూనియన్ బ్యాంకు డి ఆర్ హెచ్ మహేష్, ఆర్బీఐ ఏజీఎం పల్లవి, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డీఆర్డీఓ కౌసల్యాదేవి, వ్యవసాయ అధికారి, పశు సంవర్ధక శాఖ బాలకృష్ణ జిల్లా ఎస్సి కార్పొరేషన్ అధికారి సురేష్, సంబంధిత శాఖల అధికారులు, అన్ని బ్యాంకుల కంట్రోలర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలో ఏకవీరా దేవి ఆలయ పునరుద్ధరణ

## - వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా









వరంగల్ బ్యూరో, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): కాకతీయుల కాలంలో నిర్మించిన కాకతీయ ఇలవేల్పు ఏకవీరా దేవి ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తెలిపారు. బుధవారం కలెక్టర్ మొగిలిచర్ల గ్రామంలో పర్యటించారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని రాష్ట్ర పురావస్తు శాఖ, పర్యాటక, రెవెన్యూ అధికారులతో కలిసి సందర్శించారు. ఆలయ పునరుద్ధరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేయడం జరిగింది. మొగిలిచెర్ల గ్రామ చరిత్ర, ఏక వీర దేవాలయ చరిత్రను టార్చ్ సంస్థ కార్యదర్శి అరవింద్ ఆర్య విపులంగా కలెక్టర్ గారికి వివరించారు. వందల సంవత్సరాల క్రితం కాకతీయులు నిర్మించిన ఎకవీర దేవి ఆలయాన్ని పరిరక్షించాలని, ఆలయ అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని, పురావస్తు శిల్పాలను పరిరక్షణ చేయాలని, ఇతర మౌలిక సదుపాయలను ఏర్పాటు చేయాలని పురావస్తు శాఖ జిల్లా అధికారి మల్లు నాయక్ ను కలెక్టర్ ఆదేశించారు. పునరుద్ధరణ పనులను చేపట్టి ఆలయాన్ని ప్రజలు , పర్యాటకులకు సందర్శనార్థం అందుబాటులోకి తేవాలని సూచించారు. వాటికి కావాల్సిన నిధుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ఆలయ భూములకు సంబంధించి సర్వే చేయాలని తహసీల్దార్ ను ఆదేశించారు. గ్రామంలో వేర్వేరు ప్రదేశాల్లో ఉన్న శిల్పాలను ఒకే చోట భద్రపరిచి ప్రదర్శనకి ఏర్పాట్లు చేయాలని సూచించారు. వారి వెంట జిల్లా పర్యాటక అధికారి శివాజీ, జిల్లా పురావస్తు శాఖ మల్లు నాయక్, తహశీల్దార్ రియాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

# హెూంగార్డులకు పోలీసు తరహా హెల్త్ పాలసీ : మంత్రి పొన్నం



హైదరాబాద్, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): హెూంశాఖలో పోలీసులకు అమలు చేస్తున్న మాదిరిగానే వైద్య, ఆరోగ్య విధానాలన్నింటిని హెూంగార్డులకు కూడా వర్తించేలా చేస్తామని శాసన మండలిలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 5లక్షల నుంచి 10 లక్షలకు పెంచిందని, ఆరోగ్య శ్రీలో అనేక చికిత్స లు చేర్చామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలపై హెూంశాఖలో పనిచేసే సిబ్బందికి వారి సాలరీల నుండి క్రెడిట్ చేసి ఆర్టిసి మాదిరిగా ప్రమాదాలు జరిగినప్పుడు అందిస్తామన్నారు. హెూంశాఖలో ఎవరైనా ప్రమాదాల్లో మరణిస్తే కోటి రూపాయలకు పైగా భీమా వచ్చేలా చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ భీమా పథకం ఆర్టిసిలో అమలు చేస్తున్నామని, అక్కడ ఎవరైనా ప్రమాదంలో మరణిస్తే కోటి రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్నామని గుర్తు చేశారు. పోలీసుల ఆరోగ్య పరమైన అంశం తెలంగాణ ప్రభుత్వం బాధ్యతని, వారికి ప్రైవేట్ హాస్పటల్ లో ఎవరైనా చికిత్స నిరాకరిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. సిద్దిపేట పోలీసులు గజ్వేల్ లో జరిగిన ప్రమాదంలో మరణించిన దానిపై కూడా ఇప్పటికే కేసు నమోదైందని, వారికి రావాల్సినవి అన్ని బెనిఫిట్స్ ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.

# ఎఫ్‌డిసి ఛైర్మన్‌గా దిల్‌రాజ్ బాధ్యతలు

## అభినందనలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా దిల్‌రాజు బుధవారం ఉదయం పదవీ భాద్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్ లోని ఎఫ్.డీ.సి కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పదవీ భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమానికి హాజరై దిల్ రాజ్ ను అభినందించారు. తెలంగాణా లో ఫిలిం ఇండస్టీ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ఇండస్టీకి చెందిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వడంలో దిల్ రాజు సేవలు ఎంతగానో ఉపయోగపడతాయాని ఈ సందర్భంగామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇండియన్ ఫిలిం ఇండస్టీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణా లో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని కృషి చేస్తానని దిల్ రాజ్ పేర్కొన్నారు.

# 28న చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ప్రారంభించనున్న వైష్ణవ్, కిషన్ రెడ్డి




హైదరాబాద్,డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): రూ.430 కోట్ల వ్యయంతో నిర్మించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్‌ను ఈ నెల 28న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, మరో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కలిసి ప్రారంభించనున్నారు. ఈ స్టేషన్‌లో ఆరు ఎస్కలేటర్లు, ఏడు లిఫ్ట్‌లు, ఆరు బుకింగ్ కౌంటర్లు, మహిళలకు, పురుషులకు వేర్వేరు వెయిటింగ్ హాల్స్, హైక్లాస్ వెయిటింగ్ ఏరియా, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్ నిర్మించారు. ఈ టెర్మినల్ మొదటి అంతస్తులో కెఫ్-టేరియా, రెస్టారెంట్, రెస్ట్ రూం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఉచిత వైఫై సదుపాయం ఉంటుంది. చర్లపల్లి టెర్మినల్ ప్రారంభమయ్యాక భాగ్యనగరానికి చెందిన పలు రైళ్లు ఇక్కడి నుంచే ప్రారంభం కానున్నాయి. దీంతో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ వంటి రైల్వే స్టేషన్లపై ఒత్తిడి తగ్గుతుంది.

# అసెంబ్లీ ముందు డ్రంకన్‌డ్రైవ్ టెస్టులు పెట్టాలి : హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబర్ 18,(జర్నలిస్ట్ వార్త): గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ. పదివేల కోట్లు దోచుకున్న దొంగ హరీష్ రావు అని.. ఆ అవినీతిని మేము నిరూపిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ వ్యాఖ్యలపై హరీశ్‌రావు ఘాటుగా స్పందించారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు. సుద్దులు మాకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి.. వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు.